గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

● మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా శనివారం ఆదిభట్ల పోలీసుల ఆధ్వర్యంలో తుర్కయంజాల్ రొక్కం సత్తిరెడ్డి హాల్‌లో మండపాల నిర్వాహకులతో కలిసి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక చవితిని 11రోజుల పాటు శాంతియుతంగా, సానుకూలంగా జరుపుకోవాలని కోరారు. వినాయక చవితి అంటేనే పోలీసులకు పరీక్ష లాంటిదని అన్నారు. అన్ని శాఖల అధికారులు, మండపాల నిర్వాహకులతో సమావేశమై సమస్యలపై చర్చించుకోవడం మంచిదని అన్నారు. నిర్వాహకులు సమస్యలను తమ పోలీస్ సిబ్బందికి చెప్పుకోవాలని కోరారు. అందు కోసం ప్రత్యేకంగా ఒక అధికారిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాసబ్ చెరువు వద్ద సుమారు రెండు వేలకు పైగా వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉన్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సీసీ కెమెరాలతో పాటు, రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. నిర్వాహకులు దీపం దగ్గర నుంచి విద్యుత్ కనెక్షన్, పొల్యూషన్ వరకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు 11 రోజుల పాటు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ముందస్తుగా సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి మాసబ్‌చెరువును పరిశీలించారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరాంరెడ్డి, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఆదిభట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐ రాజు, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్, కొశిక ఐలయ్య, కుంట ఉదయ, మేతరి అనురాధ, మాధవి, కళ్యాణ్‌నాయక్, నాయకులు బచ్చిగళ్ల రమేష్, దర్శన్, మహేందర్‌రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్, ఫైర్, ఆర్టీవో, ఆర్టీసీ, పోలీస్, విద్యు త్ శాఖల అధికారులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



వినాయక మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి


మాసబ్ చెరువును పరిశీలిస్తున్న మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి

ఎఫ్‌సీఐకాలనీ కమ్యూనిటీ హాల్లో సన్నాహక సమావేశం


మాట్లాడుతున్న వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి


వనస్థలిపురం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐకాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన వినాయక ఉత్సవాల సన్నాహక సమావేశానికి ఏసీపీ కాశీరెడ్డి, కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య హాజరయ్యారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించుకున్న విధంగానే కాలనీవాసులు ఐక్యత, సోదరభావంతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఈ సంవ్సత రం కూడా జరుపుకోవాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతితోనే మండపాలు ఏర్పాటు చేయాలని, నిమజ్జన సమయంలో డీజేల అనుమతిలేదన్నారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. నిమజ్జన ఏర్పాట్లకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులు సకాలంలో ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్లు కోరారు. కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ, ఫైర్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మండప నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సహకార సంఘాల సీఈవోలు

అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెండింగులో ఉన్న రుణమాఫీని త్వరగా చేయించాలని కోరుతూ టెస్కాబ్ వైస్ ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఆధ్వర్యంలో పీఏసీఎస్ సీఈవోలు శనివారం తొర్రూర్‌లోని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీఈవోలతో సమావేశమై రుణమాఫీ కావాల్సిన వారు ఇంకా ఎంతమంది ఉన్నారని అధికారులను అడిగి ఆరాతీశారు. నియోజకవర్గంలో మొత్తం ఎంత మంది రైతులు ఉన్నారో వివరాలు తెలుసుకుని వారందరికీ సాధ్యమైనంత త్వరగా రుణమాఫీ అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. ఎవరు బయపడాల్సిన పనిలేదని అన్నారు. రైతులందరికీ రుణమాఫీ వస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 9 సహకార సొసైటీలకు చెందిన సీఈవోలు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

చావునీ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

చాదర్‌ఘాట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): చావునీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శనివారం శ్రీకారం చుట్టారు. సుమారు రూ.59లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులతోపాటు సాలార్ ఎ మిల్లత్ తాగునీటి ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. డివిజన్‌లోని ముంతాజ్ కాలనీ, బాగ్ ఎ జహరా, రేతికి మజీద్ లేన్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. షా కాలనీలోని స్థానికులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు సాలార్ ఎ మిల్లత్ తాగునీటి ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానికులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ఎంఐఎం నిరంతరం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో చావునీ డివిజన్ కార్పొరేటర్ షాహిద్ మూన్, మాజీ కార్పొరేటర్ ముర్తుజా, జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రూపాయికే వైద్యసేవల ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ స్వప్నచిరంజీవి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పసుమాములలోని శ్రీనగర్‌కాలనీలో రీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జీఎస్ చారిటీ ఆస్పత్రిని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్నచిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ చారిటీలో కేవలం ఒక్క రూపాయికే వైద్య సేవలను అందించనున్నట్లు రీడ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ చిల్లంశెట్టి గణేష్ తెలిపారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆస్పత్రికి వెళ్తే లక్షల రూపాయల బిల్లులు అయ్యే ఈ రోజుల్లో కేవలం ఒక్క రూపాయికే వైద్య సేవలను అందించడం అభినందనీయం అన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మోతే మణెమ్మరామలింగం, సెయింట్ జాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఛైర్మన్ రాంరెడ్డి, రీడ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ శమంతకమణి, డాక్టర్లు అజయ్ చంద్ర, అన్వేష, అనూష, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఉచిత వైద్య శిబిరంలో వయోవృద్ధులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వనస్థలిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆయుష్ శాఖ ఆదేశానుసారం వనస్థలిపురం హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోగులకు బీపీ, షుగర్, ఆర్థరైటిస్, వెన్నునొప్పి, జ్వరం పరీక్షలతో పాటు వివిధ రకాల వ్యాధులకు హోమియో మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం హోమియో డాక్టర్ నర్మద మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయూష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హోమియో వైద్య సిబ్బంది బి.రమేష్, మాధవి, శాంతమ్మ, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లో శనివారం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పొరెడ్డి రవీందర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్‌తో పాటు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 2 నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. పీఎం మోదీ నాయకత్వంలో, వికసిత్ భారత్ లక్ష్యంతో దేశం అన్ని రంగాలలో ప్రగతి పథంలో ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ సభ్యత్వం పొందాలని, దేశప్రగతిలో భాగస్వామ్యం కావాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, నారాయణరెడ్డి, మణిపాల్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.



మన్సూరాబాద్ డివిజన్ కాస్మోపాలిటన్ కాలనీలో వినాయక మండపం నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి లక్ష రూపాయల సొంత నిధులను తన నివాసంలో విరాళంగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు రుద్రలక్ష్మీనరసింహ, గంజి సత్తయ్య, శ్రీనివాసరావు, కుంట్ల సుధాకర్, జ్ఞానేశ్వర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు. - వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

ఈటలపై ప్రొ. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

● బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఈటల రాజేందర్‌పై ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎల్బీనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సామ రంగారెడ్డి మాట్లాడారు. పార్టీల మధ్య చిచ్చుపెట్టి విద్వేశాలు సృష్టించే వ్యక్తి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను హైడ్రా కూల్చవద్దని డిమాండ్ చేసిన ఎంపీ ఈటలపై ప్రొ.నాగేశ్వర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చెరువులను కబ్జాచేసిన బడా బాబుల ఇళ్లను కూల్చివేసిన తరుణంలో హైడ్రా చేస్తున్న పనితీరును బీజేపీ స్వాగతించిందన్నారు. కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు నిర్మించుకున్న ఇళ్లకు నోటీసులు ఇవ్వడాన్ని మాత్రమే ఎంపీ ఈటల వ్యతిరేకించిన విషయం గమనించాలన్నారు. కుహనా మేధావి ప్రొ.నాగేశ్వర్‌రావు పేదల పక్షాన పోరాడే ఎంపీ ఈటలను విమర్శించడం కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న పెద్ద నాటకం అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడం చేతకాక హైడ్రా పేరుతో హైడ్రామా సృష్టిస్తూ ప్రజల దృష్టి మరల్చుతుందని విమర్శించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే ఈటలకు ప్రొ.నాగేశ్వర్‌రావు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, పవన్‌కుమార్, నర్సింహగుప్తా, కొత్త రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి : సీపీ


ఇన్‌స్పెక్టర్ చంద్రబాబును అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ మురళీధర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. నేరేడ్‌మెట్ కమిషనరేట్‌లో శనివారం మానవ అక్రమ రవాణా నిరోధంలో ఉత్తమ పనితీరును కనబరిచిన ఇన్‌స్పెక్టర్ ఎన్. చంద్రబాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణాను నిరోధించేందుకు నూతన విధి విధానాలను అవలంభించాలని సూచించారు. మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు జాతీయ స్థాయిలో అత్యుత్తమ పనితీరును ప్రదర్శించిన ఎన్ చంద్రబాబు యునిసెఫ్ ఇండియా చీఫ్ ఆఫ్‌ఫీల్డ్ అధికారి డి జెలాలం టఫస్సే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి


పిండి నారాయణరెడ్డి కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కార్పొరేటర్ సుజాతానాయక్ కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని ఏపీఎస్ ఈబీకాలనీ, ద్వారక తిరుమల కాలనీ, రెడ్డికాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్‌కాలనీ, పోచమ్మగడ్డకాలనీ, పిండి నారాయణరెడ్డి కాలనీలలో శనివారం కార్పొరేటర్ మాన్సూమ్ టీమ్, ఆయా శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ప్రజలు అత్యావసరం ఉంటేనే బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మల్లికార్జున్, జలమండలి మేనేజర్ సురేష్, వర్క్ఇన్‌స్పెక్టర్ బిక్కునాయక్, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవడానికి ముందుకు రావాలి

● బడంగ్‌పేట్ మేయర్ పారిజాతారెడ్డి పిలుపు

సరూర్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు పేదలను ఆదుకోవడానికి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, సమాజంలో సేవా కార్యక్రమాలను విస్తరించుకుని మంచిపేరు తెచ్చుకోవాలని బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. వికాస్ ఫౌండేషన్, కాంగ్రెస్ అనుబంధ సంస్థ అయిన కార్మిక కర్షక కాంగ్రెస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కుర్మల్‌గూడ 10వ డివిజన్‌లోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో స్థానిక పేదలకు ఉచితంగా నిత్యావసరాలను పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పారిజాతారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వారికి బియ్యం, నూనె, పప్పు వగైరా సరుకులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వికాస్ ఫౌండేషన్‌లాంటి సంస్థలు ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి సమాజంలో అట్టడుగున ఉన్న వారికి అండగా నిలవాలని సూచించారు. తమ పార్టీ అనుబంధ విభాగం అయిన కార్మిక కర్షక కాంగ్రెస్ వికాస్ ఫౌండేషన్‌తో కలిసి ఈ కార్యక్రమం చేపట్టడం హర్షణీయమని ఆమె అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీశ్రీనివాస్‌రెడ్డి, కార్మిక కర్షక కాంగ్రెస్ ఛైర్మన్ కౌశల్, సమీర్, నాయకులు పింగళి సంపత్‌రెడ్డి, మల్లేశ్, మైనా, ఆనంద్‌రెడ్డి, జంపయ్య, కుమార్, సాధిక్, హరి పాల్గొన్నారు.


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, వికాస్ ఫౌండేషన్ ప్రతినిధులు

పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయండి: కరుణాకర్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెన్షన్ విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూటీఎస్ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు వై.కరుణాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2004 సెప్టెంబర్ 1న పాత పెన్షన్(ఓపీఎస్)ను తీసేసి దాని స్థానంలో కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త స్కీమ్‌ను తీసుక వచ్చిందన్నారు. దీని మూలంగా రాష్ట్రంలోని ఒక లక్ష ఇరువై వేల మంది ఉద్యోగులకు చీకటి దినంగా మారిందన్నారు. దీంతో ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత వారి జీతాలపై అభద్రత భావం ఏర్పడి మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్, యూపీఎస్‌ల పేర్లతో తీసుకవస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న(నేడు) రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే నిరసన కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్టీయూటీఎస్ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కూకిలు

మణిపూర్‌లో కూకి తెగ నివాస ప్రాంతాన్ని యూటీగా ప్రకటించాలి : కూకి స్టూడెంట్స్

బర్కత్‌పుర, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో కూకిలు నివసిస్తున్న ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతం(యూనియన్ టెర్రిటోరి)గా ప్రకటించి, పూర్తిరక్షణ కల్పించాలని కూకి స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ బ్రాంచి డిమాండ్ చేసింది. పాండిచ్చేరి మాదిరిగా రాజ్యాంగంలోని 239వ ఆర్టికల్ ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తే మణిపూర్ రాష్ట్రంలో కూకీలు శాంతియుత జీవనం సాగిస్తారని వారు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకి ఐఎన్ఎన్‌పీ ప్రతినిధులు లూనాడొంగల్, లెట్‌కోలన్ సవంటక్, ఫ్రాన్సిస్ హోకిట్, కూకి స్టూడెంట్ ఆర్గనైజేషన్ ప్రధానకార్యదర్శి తొంగమిన్ తాంగాహోకిప్, కోశాధికారి గ్రేసి కాన్సాయి, జోయ్‌సీ చాంగులాయి తదితరులు మాట్లాడారు. మణిపూర్‌లో కూకి, నాగోస్ 48శాతం జనాభా ఉండగా మైతాస్ కులస్థులు 52శాతం ఉన్నారని గత సంవత్సరం జరిగిన సంఘటనల్లో కూకిలు తీవ్రంగా నష్టపోయారని వారు ఆరోపించారు. మణిపూర్‌లో మెజార్టీ కులస్థులైన మైథాస్‌లతో కలిసి జీవించాలని కూకీలు కోరుకోవడం లేదని, మళ్లీ దాడులు జరుగుతాయోమనని, తాము ఇండియా నుంచి విడిపోయేప్రసక్తే లేదని వారు స్పష్టం చేశారు.

కాంట్రాక్టర్ల వేధింపుల నుంచి కాపాడండి

● ఇసుక లారీ యజమానుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఇసుక లారీ యజమానులు

బంజారాహిల్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఇసుక క్వారీ కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లతో తమను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని ఆటోనగర్ యజమానుల సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సంస్థ జీఎం రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన జీఎం రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆటోనగర్ ఇసుక లారీల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ మాట్లాడుతూ తాము అధికారికంగా ప్రభుత్వానికి డీడీ తీసి క్వారీల వద్దకు వెళ్లగానే అక్కడ ఉన్న కాంట్రాక్టర్లు లోడింగ్ పేరుతో రూ.4 వేల నుంచి రూ.5 వేలు, అదనపు బకెట్ పేరుతో రూ.2 వేలు, పట్టా పేరుతో వెయ్యి రూపాయలు, ఎక్స్‌కవేటర్ పేరుతో వెయ్యి రూపాయలు, గ్రామపంచాయతీ అంటూ వెయ్యి రూపాయలు, కాంటా పేరుతో రూ.200 ఇలా దాదాపుగా ఒక్కో లారీకి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనికి తోడు అధికారులు తనిఖీలు చేసినప్పుడు ఓవర్ లోడ్ పేరుతో లారీ యజమానులు కేసుల పాలవుతూ, జరిమానాలు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు టీజీఎండీసీ ఎండీ, జీఎంలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి క్వారీల్లో అక్రమంగా వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకొని లారీ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపేట లారీల అధ్యక్షుడు నర్రి వెంకన్న, బల్వంతరెడ్డి, నాగేందర్‌రెడ్డి, రాజు ముదిరాజ్, కాసుల జంగయ్యగౌడ్, ఆకుల శ్రీను, లగ్గొని శ్రీనివాస్, రాజేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులపాలై స్విగ్గీ డెలివరీ బాయ్ ఆత్మహత్య

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి) : నాగోల్ సాయినగర్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్ ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగోల్ సాయినగర్‌లో ఉండే కే. సందీప్‌రెడ్డి(25) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఇటీవల అతడు విధులకు వెళ్లడం లేదు. బెట్టింగ్ ఆడుతూ అప్పుల పాలయ్యాడు. సూర్యాపేట తిరుమలగిరి, తొండ గ్రామంలో ఉండే పొలం పాస్‌బుక్ బ్యాంకులో పెట్టి రుణం తీసుకుంటానని కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టేవాడు. ఆగస్టు 30న రాత్రి ఇంటికి వచ్చి, బయటే తినేసి వచ్చానని చెప్పి తను రేకుల గదిలో పడుకున్నాడు. శనివారం సాయంత్రం రేకుల గదికి వెళ్లి చూడగా అతడు సీలింగ్ రాడ్డుకు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. పొరుగువారి సాయంతో అతడిని కిందకు దించి చూశారు, అప్పటికే అతడు మృతిచెందాడు. రాత్రి నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

గోధుమకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణం

● నీటి పారుదలశాఖ ఫిర్యాదుతో ఏస్ వెంచర్స్‌పై కేసు నమోదు

కొత్తపేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): నాగోల్ పీఎస్ పరిధిలోని తట్టిఅన్నారం గోధులకుంట ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణం చేపట్టిన ఏస్ వెంచర్స్ నిర్వాహకులపై నీటిపారుదల శాఖ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తట్టిఅన్నారం పరిధిలోని గోధులకుంట, (తట్టి కాన చెరువు) ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లో ఏస్ వెంచర్స్ సంస్థ నిర్వాహకులు(విల్లాస్) నిర్మాణం చేపట్టారు. వెంచర్ నిర్వాహకులు అక్రమంగా ఆర్సీసీ కాంపౌండ్ వాల్, బేస్మెంట్ నిర్మించారు. ఈ విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఏస్ వెంచర్స్ ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌లో కట్టిన నిర్మాణాన్ని తొలగించాలని సూచించారు. నీటిపారుదల శాఖ ఏఈ ఎండీ. తస్పీన్ రజా, అబ్దుల్లాపూర్‌మెట్ గిర్దావర్ నిజాముద్దీన్ నాగోలు పోలీస్‌స్టేషన్‌లో ఏస్ వెంచర్స్‌పై ఫిర్యాదు చేశారు. ఈమేరకు నీటిపారుదల చట్టం ప్రకారం నాగోలు పోలీసులు ఏస్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లి. పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల హాస్టల్ బాత్‌రూంలో పడి విద్యార్థి మృతి

● అధికారుల నిర్లక్ష్యంతోనేనన్న తోటి విద్యార్థులు

వనస్థలిపురం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్‌లోకి వెళ్లిన దివ్యాంగుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మన్సూరాబాద్ డివిజన్ శైలజపురికాలనీలోని ప్రభుత్వ వికలాంగుల హాస్టల్లో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మాడ్గుల మండలం నల్లవారిపల్లి గ్రామానికి చెందిన అమ్మో జగన్(26) డిగ్రీ పూర్తిచేశాడు. కాగా జగన్ తండ్రి రామచంద్రయ్య సంవత్సరం క్రితం మృతి చెందగా, తల్లి పెంటమ్మ మూడు సంవత్సరాల క్రితమే మృతి చెందింది. దీంతో ఎవరి సపోర్ట్ లేని జగన్ మన్సూరాబాద్ డివిజన్ శైలజపురికాలనీలోని ప్రభుత్వ వికలాంగుల హాస్టల్లో ఉంటు గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం జగన్‌కు యాసిడిటీ నొప్పి రావడంతో హాస్టల్లో ఉండే నర్సు మందులు ఇవ్వడంతో తగ్గింది. శనివారం ఉదయం జగన్ స్నానానికి హాస్టల్లోని బాత్‌రూమ్‌లోకి వెళ్లిన వెంటనే ఆకస్మికంగా కిందపడిపోయాడు. ఇది గమనించిన తోటి విద్యార్థులు జగన్‌ను వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఇరువై నిమిషాల ముందు హాస్పటల్‌కు తీసుకవస్తే జగన్‌కు ప్రాణాపాయం తప్పేదని వైద్యులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతోనే స్నానానికి వెళ్లిన జగన్ శ్వాస అందక మృతి చెందినట్లు తోటి విద్యార్థులు ఆరోపించారు. అనంతరం హాస్టల్ వార్డెన్, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఆటోనగర్ శ్మశానవాటికలో జగన్ అంత్యక్రియలు నిర్వహించారు.


జగన్(ఫైల్)

హాస్టల్‌లో సరిపడా వసతులు లేకనే జగన్ మృతి : తోటి విద్యార్థులు

హాస్టల్లో సరిపడ సదుపాయాలు, తమ బాగోగులు చూసుకునే సిబ్బందిలేకపోవడంతోనే తమతోటి విద్యార్థి మృతిచెందాడని పలువురు దివ్యాంగ విద్యార్థులు వాపోయారు. హాస్టల్ వార్డెన్, హాస్టల్ నర్సు ఇద్దరు రోజులో ఒక గంటసేపు మాత్రమే ఉంటారని, హాస్టల్‌కు వాచ్‌మెన్ లేడని ఆవేదన వ్యక్తం చేశారు. దివ్యాంగులమైన తాము రెండో అంతస్తు నుంచి ఎక్కిదిగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడితే తమని ఆదుకునే నాథుడే లేరన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న జగన్ అకస్మికంగా మృతి చెందడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దివ్యాంగుల హాస్టల్లో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి తమ శ్రేయస్సుకు కృషి చేయాలని పలువురు దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు.